
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 మే 2023
5
అన్నమయ్య



రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా అబ్దుల్ కలీమ్



కలీమ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

వాల్మీకిపురం: రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా పట్టణంలోని నాయక్‌వీధికి చెందిన అబ్దుల్ కలీమ్ నియమితులయ్యారు. మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ జారీ చేసిన ఉత్తర్వులను శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ ద్వారా విద్యార్థులు, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, తదితర కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాన్, మౌలానా, సాధిక్, ఫయాజ్, సమీ పాల్గొన్నారు.

శరవేగంగా నాడు-నేడు పనులు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

నాడు-నేడు పనులు శరవేగంగా జరగాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మనబడి నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనబడి నాడు నేడు కింద జిల్లాలో చేపడుతున్న వంట గదులు, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ తదితర పనులన్నీ పెండింగ్ లేకుండా పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ పనుల వేగవంతం కోసం కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు తమ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చేవారానికి 15 లక్షల నుంచి 20 లక్షలు ఖర్చు పెట్టాలన్నారు. స్కూల్ తెరిచేలోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. సరిగా పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతివారం ఒకరోజు నాడు నేడు పనులపై సమీక్ష నిర్వహించాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారం నుంచి పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాజెక్టులన్ని కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. వంట గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలకు 80 శాతం నిధులు ఖర్చు చేయాలన్నారు. మేజర్ అండ్ మైనర్ రిపేర్ పనులన్నీ మొదలు కావాలన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించాలన్నారు. ఈ అవార్డుల వేడుకను నియోజకవర్గం, జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మార్కుల ఆధారంగా నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఘనంగా సత్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సన్మానం చేయాలన్నారు. విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కూడా సత్కరించాలన్నారు. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ వేడుకను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులుపాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పుచ్చలపల్లి సుందరయ్య సత్యాన్ని మాత్రమే నమ్మి, మాట్లాడేవారని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు షేక్ ఫయాజ్ అన్నారు. సిపిఎం కార్యాలయంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉండే వారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతటి వారినైనా నిలదీసి అడి గేవారన్నారు. ఎంపీగా ఉన్నా సైకిలు పై సభకు వెళ్లే నిరాడంబరం వ్యక్తి పుచ్చలపల్లి అన్నారు. సర్వస్వం పార్టీకే అంకితం చేసిన త్యాగశీలి అన్నారు. తన వాటాకు వచ్చిన యావదాస్తిని ప్రజా ఉద్యమాలకు ఖర్చుచేశారన్నారు. అనేక విలువైన పుస్తకాలను రాశారన్నారు. 1985 మే 19న మరణించే వరకు ఆయన ప్రజల కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఉపాధ్యక్షులు నాగబసిరెడ్డి, సిఐటియు నాయకులు నాగేష్ గౌడ్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ డి.సి వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు తులసిరాం, పట్టణ ఉపాధ్యక్షులు రమణమ్మ, ఐద్వా మహిళా సంఘం రామక్క పాల్గొన్నారు.



రాయచోటి : సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్ : పీడిత ప్రజల కోసం అహర్నిశలూ పాటుపడి జీవితాన్ని త్యాగంచేసిన మహామనీషి సుందరయ్య అని సిపిఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హరిశర్మ, టి.హరేంద్రనాథ్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా మదనపల్లి సిపిఎం ఆఫీసులో సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే దోపిడీని ఎదురించడం నేర్చుకున్నారని చెప్పారు. చిన్నతనంలోనే దళితుల పట్ల ఉన్న వివక్షను ఎదిరించి ఆదర్శప్రాయుడైనారని, వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి మార్గదర్శకుడైనారన్నారు. యువకులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, కర్షకుల సమస్యలపై ఏకం చేసి పోరాటబాట నేర్పి మహానాయకుడైనారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్. చంద్ర, వెంకటేష్, నాగరాజు, సురేంద్ర, జయరాం, గౌరి,గంగ సుందరయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు.



మదనపల్లె : సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వృద్ధ దంపతుల ఆత్మహత్యలో పోలీసుల ప్రమేయం లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణంలో వృద్ధ దంపతుల బలవన్మరణంలో పోలీసుల ప్రమేయం లేదని డిఎస్‌పి కేశప్ప తెలిపారు. శుక్రవారం తన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల మధ్య ఉన్న ఆస్తి గొడవలతో, తండ్రి కొడుకుల మధ్య ఆర్థీ తగాదా, అనారోగ్య కారనాలవనన వారు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆస్తివివాదమై తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఈ నెల 17వ తేదీ నరసింహులు నాయుడుపై అతని తమ్ముడు అప్పల్ల ఫిర్యాదు చేశారని, మా అన్న నన్ను బెదిరిస్తున్నాడని, ఆస్తి విషయమై అడిగిత దాడికి దిగుతున్నాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఫోన్ ద్వారా విషయాన్ని చెప్పి వచ్చి సమస్యను పరిష్కరించు కావాలని నరసింహులు, సుబ్బమ్మ దంపతులకు తెలిపిపారని, అప్పుడు నరసింహులు నాయుడు నా భార్యకు ఆరోగ్యం బాగాలేదు, విరూపాక్షపురం వెళ్లాలని పోలీసులకు వివరణ ఇవ్వడంతో ఏదో ఒక సమయంలో అయినా వచ్చి పరిష్కరించుకోమని పోలీసులు తెలిపారు. అప్పులనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోమని చెప్పారు తప్ప ఎక్కడా బెదిరించలేదన్నారు. వ్యక్తిగత కారణాలైన ఆర్థీ, కుటుంబ సమస్యల వలననే వృద్ధ దంపతులు పురుగుల మందును కూల్ డ్రింక్‌లో కలుపుకొని అనపగుట్ట తమ స్వగృహంలో ఆత్మహత్య చేసుకొన్నారన్నారు. ఈ విషయంపై మదనపల్లె టూ టౌన్ పోలీస్ వారు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు వారిని బెదరించడం లేదా సివిల్ వివాదాలలో తలదూర్చడం అవాస్తవమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప



విద్యార్థులను అభినందిస్తున్న సిఐ మురళీకృష్ణ

మలేషియాలో మదనపల్లె కరాటే విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మరక్షణకు కరాటే విద్య చాలా అవసరమని తల్లిదండ్రులు తమ బిడ్డలను చదువుతోపాటు కరాటే విద్యలో కూడా రాణించేలా ప్రోత్సహించాలని మదనపల్లి టూ టౌన్ సిఐ ఎస్ మురళీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మలేషియాలో జరిగిన మహా గురు సోక్ సార్ కె.అనంతన్ ఆధ్వర్యంలో ఒకినావా గూజూరియో 19వ ఛాంపియన్ షిప్ పోటీలలో మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు సత్తచాటి మూడు బంగారు పథకాలు సాధించారని అసోసియేషన్ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎ.ఆర్.సురేష్, టీం మేనేజర్ ఎం.మణిసాయి వెల్లడించారు. విద్యార్థులను అభినందిస్తూ సమావేశంలో వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కరాటేలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నా మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు మూడు రోజు పాటు మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో తమ సత్తా చాటారని తెలిపారు. ఒకినావా గూజూరియో 19వ ఛాంపియన్ షిప్ పోటీలు ఈపో సిటీలో నిర్వహించారు. ఈ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలలో మదనపల్లె కరాటే విద్యార్థులు పాల్గొన్నారన్నారు. సురేష్ మాట్లాడుతూ మలేషియాలో జరిగిన కరాటే పోటీలలో ఇండియా, సౌత్ ఆఫ్రికా, మలేషియా, పినాంగ్, మల్లకా, పెరక్, ఇండోనేషియా, పాకిస్థాన్, అండమాన్ నికోబార్ దీవులు, నేపాల్, జర్మనీ తదితర దేశాలకు చెందిన కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో మదనపల్లె విద్యార్థులు బంగారు పథకాలు సాధించడం వారిలోని నైపుణ్యాన్ని సూచిస్తుందన్నారు. మదనపల్లెకు గర్వకారణంగా బంగారు పథకాలు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. మలేషియా నుండి మదనపల్లికి విచ్చేసిన కరాటే విజేతలను అభినందించిన టూ టౌన్ సిఐ ఎస్ మురళీకృష్ణ, డాక్టర్ పాల్ రవికుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంమూర్తి, కృష్ణమూర్తి, వికలాంగుల సంఘ నాయకుడు మౌలాలి, కరాటే రమణ, కరాటే తల్లిదండ్రులు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు పరిసరాల్లో 'మహాకాళి' చిత్రీకరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ పరిసరాల్లో మహాకాళి లఘు చిత్ర నిర్మాణం జరుగుతోంది. మంజుశ్రీ క్రియేషన్స్, మన పీలేరు యూట్యూబ్ ఛానల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ లఘు చిత్రానికి పిఆర్ అజీజ్ భాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పీలేరులో డైరెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈ సమాజంలో జరుగుతూన్న ఓ వాస్తవ సంఘటనను ఇతివృత్తంగా తీసుకుని, ప్రేక్షకులు, ప్రజలకు ఓ మంచి సందేశాన్ని ఇవ్వాలన్న సదుద్దేశంతో ఈ లఘు చిత్ర నిర్మాణాన్ని మొదలు పెట్టామని చెప్పారు. రెండు రోజులుగా ఈ చిత్రాన్ని బోడుమల్లువారిపల్లి, సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కల్లూరు, మొదలగు ప్రదేశాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. మంజుశ్రీ నిర్మాతగా చేపట్టిన ఈ లఘు చిత్రంలో కథానాయకుడిగా అజీజ్ భాయ్, కథానాయకిగా మంజుశ్రీ, ఇతర తారాగణంలో 'ఆల్ ది బెస్ట్' ఖాదర్ బాష, బాబ్జాన్, సిబ్బాల విజయ్, గాయత్రి, మహేష్, యోగేష్, విలన్ శివ తదితరులు ఉన్నారు. త్వరలోనే యూట్యూబ్ ద్వారా విడుదలయ్యే ఈ లఘు చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి ఆదరిస్తారని, ఆదరించాలని కోరుతున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు కోరుతున్నారు.



మహాకాళి లఘు చిత్రంలోని ఓ సన్నివేశం

ఎఐసిఇఎ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం

మదనపల్లె అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జి-3045 మదనపల్లె ఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐసిఇఎజి 3045 జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులుగా ఎస్. యస్వంత్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా జె.జనార్ధన్, కె.ముని వెంకోబరావు, పి.లక్ష్మీకాంత్, ఎస్‌పిడిసిఎల్ గౌస్ బాషా నియమించారు. పుంగనూరు సబ్ స్టేషనులో విధులు నిర్వహిస్తూ మరణించిన ప్రభాకర్ కుటుంబంలో కారుణ్య నియామకం కింద హారికని నియమించినందుకు విద్యుత్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ 3045 సభ్యత్వాన్ని నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ముఖ్యమంత్రి ద్వారత్తను, అనుభవాన్ని పరిగణలో తీసుకుని రెగ్యులరైజ్ చేస్తారని కార్మికులందరూ ఆశాభావంతో ఉన్నారని, యాజమాన్యంతో ఈనెల 9వ తేదీన జరిగిన సమావేశాన్ని పూర్తిగా కార్మికులకు వివరించామన్నారు. యాజమాన్యం కార్మికులందరినీ శాఖల్లో విలీనం చేసుకోవాలని యాజమాన్యానికి తెలియజేశామని, తొందరలో మంచి నిర్ణయం తీసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు.కార్మికులందరూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి పదేపదే విషయాన్నీ తీసుకెళ్తున్నామని జిల్లా పెద్దయినటువంటి మంత్రిపై పూర్తి నమ్మకంతో ఉన్నామని వారు స్పష్టం చేశారు.

దోచుకోవడం, దాచుకోవడం వైసిపి నైజం : జనసేన

రాజంపేట అర్బన్: దోచుకోవడం దాచుకోవడం వైసిపి ప్రభుత్వం నైజమని రాజంపేట జనసేన నాయకులు తెలియజేశారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఆకేపాడు పంచాయతీలో గల రేణింతల, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, నవోదయ, తదితర గ్రామాలలో పర్యటించి పవనన్న ప్రజా బాట 94వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందరరేగా జనసేన నాయకులు మాట్లాడుతూ రేణింతల గ్రామంలోని ప్రజలు వైసిపి పరిపాలన పై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా 2024 ఎన్నికలలో జనసేన ను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భాస్కర పంతులు, గోపి, పోలిశెట్టి శ్రీనివాసులు, వీర మహిళలు శిరీష, మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా పరిధిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఎపిఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో తదితర ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వపు జిల్లాలైన కడప, చిత్తూరులలో ఆయా ఇంజినీరింగ్ శాఖల ద్వారా అన్నమయ్య జిల్లా పరిధిలో చేపట్టిన పనులలో నిర్దిష్ట కాల పరిమితిలో లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ విద్యుత్ ఇరిగేషన్ శాఖల ద్వారా అన్నమయ్య జిల్లా పరిధిలో ప్రతిపాదించిన పనులు, అనుమతులు మంజూరైన పనులు, పూర్తి చేసిన పనులు పెండింగ్ పనులు, ఇంకనూ పెండింగ్ ఉండడానికి గల కారణాలపై ఆయా శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి చేసిన పనులకు ఎంత మేర బిల్లులు చెల్లింపులు జరిగాయి, ఇంకను చెల్లించాల్సిన బిల్స్ ఎన్ని తదితర వివరాలపై ఆరా తీశారు. పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడూ బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించిన నిర్వాసితులకు పరిహారం త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌హెచ్ - 440, ఎన్‌హెచ్-42 జాతీయ రహదారుల భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు అంశంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి-వేంపల్లి ఎన్‌హెచ్-440 కోసం 50 ఎకరాలు, ములకల చెరువు - మదనపల్లి ఎన్-42 కోసం 45 ఎకరాలు భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. ఈ మేరకు సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసితులకు ఈ నెలాఖరులోగా పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్ 440, ఎన్‌హెచ్ 42 లలో ఎంత భూసేకరణ జరిగింది, ఇంకెంత చేయాలి, భూ సేకరణలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, భూమి కోల్పోయిన వారికి ఇప్పటివరకు అందజేసిన పరిహారం, ఇంకను అందజేయాల్సిన పరిహారం తదితరాలపై కలెక్టర్ సమీక్షించి తగు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఆర్అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్, జాతీయ రహదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ముస్లిముల పక్షపాతి సిఎం జగన్ : 'మేడా'

రాజంపేట అర్బన్ : హజ్ యాత్రకు వెళుతున్న 1814 మంది హాజీలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.14.51 కోట్లు తమ ఖాతాలలో జమ చేసినందుకు శుక్రవారం బోయినపల్లెలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మేడా మల్లిఖార్జునరెడ్డిని కలిసి మైనారిటీ మత పెద్దలు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, రాష్ట్ర డైరెక్టర్ జాహిద్ అలీ, వైయస్సార్సీపి మైనారిటీ నాయకులు మసూద్ అలీ ఖాన్, వార్డు కౌన్సిలర్ సూరి, నందలూరు మండల కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, మాజీ సర్పంచ్ ఖాదర్ భాష, సత్తార్, అబ్దుల్లా పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు

రాజంపేట అర్బన్: మండల పరిధిలోని పెద్దకారంపల్లి పంచాయతీలో ప్రభుత్వం నూతనంగా కేటాయించిన ముస్లిం శ్మశాన వాటికలో శుక్రవారం మంచి నీటి బోరును ఏర్పాటు చేశారు. రూ.3 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి సహకారంతో ఈ బోరును ఏర్పాటు చేయడం జరిగిందని ఖబరస్థాన్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు జాహిద్ అలీ తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనలతో బోరు ఏర్పాటును ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మసూద్ అలీ ఖాన్, కౌన్సిలర్లు న్యామతుల్లా, మున్నా, ముస్లిం పెద్దలు నజీర్, షఫీవుల్లా, అబూబకర్, టైగర్ హుస్సేన్, సర్పంచ్ మౌలాలి, మున్నాఫ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే చింతల

విశ్వసనీయతకు మారుపేరు జగన్ :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సంక్షేమ పథకాలతో పాటు ప్రజోపయోగ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గూడుకట్టుకున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జర్రావారిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఎమ్మెల్యే చింతల.. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ అందరి సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే చింతల దృష్టికి ప్రజలు పలు సమస్యలు తీసుకొచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో జర్రావారిపల్లి నూతన సచివాలయం వద్ద మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, జడ్‌పిటిసి నిర్మల, అటవీశాఖ అధికారులు సుధాకర్, జ్యోతి, గిరినాథ బాబు, బాలసుబ్రమణ్యం, నాయకలు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, చంద్ర, ఆనంద, రాయుడు, రవి, చలపతి, విశ్వనాథం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి నిదర్శనం

ప్రజాశక్తి - రాయచోటి

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సంక్షేమ పథకాలులే నిదర్శనమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్. అల్లాబకాస్ సిఎల్‌పి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20న కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సిద్ధరామయ్యకు అభినందనలు తెలియజేశారు. కర్ణాటకలో అధికార బిజెపి కుట్రలను ఎత్తుగడలను ఆ రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుకు చేయడానికి నిరంతరం కృషిచేసిన కర్ణాటక పిసిసి అధ్యక్షులు డి.కె.శివకుమార్‌కు అభినందనలు తెలియజేశారు. అదే తరుణంలోనే ఆంధ్ర రాష్ట్రంలో కూడా 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, రూ.500 లకే వంటగ్యాస్ సిలిండర్ , రైతులకు రూ. 3 లక్షల వరకు రుణమాఫీ, గ్రామీణ ఉపాధి పథకంలో రైతులకు అనుసంధానం వంటి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో ఎపిసిసి డెలిగేట్ ఎస్ఎండి గౌస్, పిసిసి జనరల్ సెక్రటరీ ఖదీర్, కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు ఖాదర్ ఖాన్ పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం



వాలంటీర్‌ను సన్మానిస్తున ఎమ్మెల్యే గడికోట, కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వాలంటీర్ల సేవలు అభినంద నీయమని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్స్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించిన మూడవ ఏడాది వాలంటీర్లకు వందన కార్యక్రమాన్ని వారు ప్రసార మాధ్యమాల ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది అవార్డులుతో సత్కరిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వివక్ష ,అవినీతికి తావు లేకుండా వాలంటీర్ల వ్యవస్థ పనిచేయాలని సూచించారు. గ్రామ, వార్డు వాలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు. ఇంటింటి సర్వే, పెన్షన్ల పంపిణీ, యాప్‌ల వినియోగం, నవరత్నాల అమలులో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ,పెన్షన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు మంజూరులలో వాలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలతో వాలంటీర్లు స్ఫూర్తిగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్లని కలెక్టర్ గిరీష తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలును అర్హులందరికీ అందించి ప్రజలకు మరింత దగ్గర కావాలని వాలంటీర్లకు సూచించారు. సేవా వజ్ర, రత్న అవార్డులు రానివారు నిరూత్సాహ పడొద్దన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్‌సెల్‌లో ప్రస్తుతం అధికంగా భూ సమస్యలుపై అర్జీలు వస్తున్నాయని, గతంలో అయితే పెన్షన్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందలేదని ఎక్కువగా ఫిర్యాదులు వచ్చేవని, సచివాలయ,వాలంటీర్ వ్యవస్థలు రావడంతో ఇప్పుడు ఈ ఫిర్యాదులు రావడం అతి తక్కువ అని, సాంకేతిక సమస్యల కారణంగా పథకాలు రానివారు వస్తుంటారని, అర్హత ఉంటే పథకాలును ప్రభుత్వమే లబ్ధిదారుల ఇళ్లకు అందిస్తోందన్నారు. ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రదానం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజల చిరునవ్వులు, ఆశీర్వాదాలే మాకు కొండంత బలం. జగనన్న సైనికులుగా ఉన్నందుకు గర్విస్తున్నాం అని వాలంటీర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, జడ్‌పి డిప్యూటీ సిఇఒ రమణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్,మైనారిటీ సీనియర్ నాయకులు అలీ నవాజ్, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, గౌస్ ఖాన్, అల్తాఫ్, జానం రవీంద్ర యాదవ్, కో-ఆప్షన్ అయ్యవారు రెడ్డి,జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యుడు నవరంగ్ నిస్సార్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, అజ్మతుల్లాఖాన్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.


వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

వేసవి కాలంలో తగిలే వడదెబ్బపై మండల పరిధిలోని కమ్మపల్లెలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌బాబు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే కాళ్లకు చెప్పులు ధరించి, తలకు టోపీ గాని, రుమాల గాని ధరించాలన్నారు. పలుచటి నూలు దుస్తులు ధరించాలని, నల్లటి దుస్తులు ధరించరాదన్నారు. ఎవరికైనా తలనొప్పి, తల తిరగడం, అధిక జ్వరం, నీరసం, నాలుక ఎండిపోవడం మగతగా ఉండడం, స్పృహ కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలు అన్నారు. ఆ లక్షణాలు కనిపిస్తే వెంటనే అతడిని నీడపాటుగా చేర్చి దుస్తులు వదులుగా చేసి విసనకర్రతో విసరాలన్నారు. తర్వాత వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగయ్య, 104 స్టాఫ్ మోహన్, ఎంఎల్‌హెచ్‌పి సరస్వతి, ఎఎన్ఎం ప్రేమకుమారి, ఆశా వర్కర్స్ దేవి, రజియా, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఆదర్శ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరమునకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వార ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో విద్య పొందగోరు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి పేర్కొన్నారు. ఈ నెల నుంచి 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

కలకడ : ఇంటర్మీడియట్ 2023-24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మాలంగ షావలి తెలిపారు. గత ఏడాది పదవ తరగతి ప్రభుత్వ ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన విద్యార్థులు, స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉచిత విద్యను అభ్యసించడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ప్రతి ఒక్క విద్యార్థి ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 2023-24 సంవత్సరంకు సంబంధించి ఇంటర్మీడియట్ లో చేరదలచిన వారు ఆన్‌లైన్లన ఈనెల 22వ తేదీ నుంచి జూన్ నెల 7వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు కళాశాల ప్రిన్సిపల్ లీల శ్రీహరి ఒక ప్రకటనలో తెలియజేశారు.


ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

విధినిర్వహణలో అలసత్వం తగదు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలకడ

విధి నిర్వహణలో అలసత్వం పనికి రాదని డిఎంఅంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ సిబ్బంది ఆదేశించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలను పాటించి విధులకు హాజరు కావాలని సూచించారు. తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేసేందుకు సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను నమోదు చేసుకొని ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యశాలల్లో ఉన్న అధికారులు పరిశీలించి ల్యాబ్‌ను, అందులో ఉన్న పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం బాటవారిపల్లెలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య అధికారి మల్లికార్జున, ఎంపిహెచ్ఒ వెంకటేశు, సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది స్టాఫ్ నర్సులు భాగ్యలక్ష్మి, పెంచలయ్య, ల్యాబ్ టెక్నీషియన్ హాజరా, ఫార్మసిస్ట్ ఉత్పల పాల్గొన్నారు.


విద్యా సామగ్రి కిట్లను అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గ్రంథాలయాలతో సంపూర్ణ విజ్ఞానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సంపూర్ణ విజ్ఞానానికి గ్రంథాలయాలు నిలయాలని మదనపల్లె లయన్స్ క్లబ్ ఆఫ్ అభయ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల ఆదేశాల మేరకు గొల్లపల్లి రింగ్ రోడ్డులోని ప్రధాన శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం 11వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం మదనపల్లి లయన్స్ క్లబ్ అభయ అధ్యక్షులు జయదేవ్ రెడ్డి, కార్యదర్శి ఎన్.సుబ్బారెడ్డి, కోశాధికారి బి.కరుణాకర్‌రెడ్డి, సర్వీసెస్ చైర్మన్ సాయిశేఖర్‌రెడ్డి, బి.టి. కళాశాల కరస్పాండెంట్ మునిరత్నమయ్య, సహదేవ రావు, టిఎస్‌పి కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ రామూర్తిలు ఈ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం విద్యార్థులకు లయన్స్ క్లబ్ అభయ ప్రతినిధులు విద్యా సామగ్రి కిట్లను అందజేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ ఉపాధ్యాయులు రెడ్డెప్ప, ప్రసాద్ శర్మ, విజయలక్ష్మి, మదన్ మోహన్, చంద్రకళ, రమణమ్మ పాల్గొన్నారు.

ఎకో టూరిజం పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామాపురం

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో జరుగుచున్న ఎకో టూరిజం పనులును ఫారెస్ట్ అధికారులుతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని గువ్వల చెరువు ఘాట్‌లో శివాలయం ఎదురుగా ఓల్డ్ పారెస్ట్ బంగ్లా సమీపంలో జరుగుచున్న ఎకో టూరిజం పనులు, ట్రెక్కింగ్‌స్పాట్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గువ్వల చెరువు ఘాట్‌లో జరుగుచున్న ఎకో టూరిజం అభివృద్ధి పనులలో భాగంగా చిల్డ్రన్ పార్క్, గెస్ట్ హౌస్, వాహనాల పార్కింగ్ తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ గిరీషలకు ఫోన్ ద్వారా కోరారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపిపి గడికోట జనార్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీచైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు శివయ్య, రఘురాం, వెంకటరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఒ బాలసుబ్రమణ్యం, ట్రైనీ ఎఫ్ఆర్ఒ కళావతి, డిఆర్ఒ ఓబులేసు, ఎఫ్ఎస్ఒ షకీల్, ఎఫ్ఇఒ బాష పాల్గొన్నారు.


ఎకో టూరిజం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మామిడిలో ఫ్రూట్ కవర్లతో తెగుళ్ల నివారణ


ఫ్రూట్ కవర్ వాడిన మామిడికాయలను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-నిమనపల్లి

మామిడి సాగులో ఫ్రూట్ కవర్ల వాడకంతో తెగుళ్లను నివారించవచ్చని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై.పీరుసాహెబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగంవారిపల్లిలోని రైతు కే.నరసింహులు గుప్తాకు చెందిన మామిడి తోటలో దిగుబడులను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వి.శ్రీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో మామిడి తోటల సాగులో పండు ఈగ యాజ మాన్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఫ్రూట్ కవర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా గత నెలలో రైతు కే.నరసింహులు గుప్తాకు చెందిన మామిడి తోటలో మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లను కట్టి ఉంచినట్లు తెలిపారు. శుక్రవారం మామిడి కాయలకు కట్టిన ఫ్రూట్ కవర్లను తొలగించారు. ఫ్రూట్ కవర్లు కట్టిన కాయలకు, కట్టని కాయలకు తేడాలను చూపించడం జరిగిందన్నారు. ఈ ప్రయోగంలో ఫ్రూట్ కవర్లు కట్టిన కాయలకు ఎటువంటి పురుగులు, తెగుళ్లు ఆశించకుండా నాణ్యతతో కూడిన దిగుబడి వచ్చిందని. ఫ్రూట్ కవర్లు కట్టని కాయలకు తామర పురుగు, కాయతొలుచు పురుగు, మసి మంగు ఆశించిందని అన్నారు. రైతు నరసింహులు గుప్త మాట్లాడుతూ ఫ్రూట్ కవర్లు వాడిన కాయల్లో రంగు, నాణ్యత అధికంగా ఉందని, దీని ద్వారా రైతు నాణ్యతతో కూడిన అధిక దిగుబడిని సాధించి అధిక లాభాలను పొందవచ్చని అన్నారు. మామిడి తోటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఫ్రూట్ కవర్లను వాడడం వలన నాణ్యత కలిగిన అధిక దిగుబడితో రైతులు లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వెంగంవారిపల్లి ఉద్యానవన శాఖాధికారి జయకృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామంలో స్థానిక సర్పంచు సుబ్రమణ్యంతో కలసి పర్యటించారు. ఆచార్లపల్లి, గుండ్లబురుజు, గుండ్లబురుజు మాలపల్లి, బొంతవారిపల్లి, గొల్లపల్లిలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా అని ఆరా తీశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలువురు రోడ్లు వేయించాలని, కాలువలు ఏర్పాటు చేయాలని, పింఛన్ మంజూరు చేయించాలని కోరారు. బొంతవారిపల్లి కాలనీకి తాగునీటి బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. గుండ్లబురుజు నుంచి మదన పల్లెకు వెళ్లాలంటే ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మదనపల్లి నుంచి గుండ్లబురుజు మీదుగా దివిటివారిపల్లి వరకు ప్రజలకు సౌకర్యవంతంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను వాలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేరుస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని ప్రతి ఒక్కరం కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, ఎంపిటిసి రెడ్డి వెంకటేష్, వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆంబికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామ మోహన్‌రెడ్డి, తహాశీల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ లీలామాధవి, ఎస్ఐ రామకృష్ణ, నాయకులు చంద్రారెడ్డి, చక్రపాణిరెడ్డి, నరేంద్రరెడ్డి, నాగరాజా, షావల్లి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే


గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్నెస్ డే పై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

'గ్లోబల్ యాక్సెసిబిలిటీ'పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మ చెరువు మిట్టలో గల వెలుగు సంస్థ నందు మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్, దీందయాల్ డిసైబుల్డ్ రెహాబిలిటేషన్ స్కీం వారి ఆదేశాల మేరకు గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్నెస్ డే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే నెల 3వ గురువారం గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్నెస్ డే గా జరుపుకుంటున్నా మని తెలిపారు. శుక్రవారం వెలుగు సంస్థ నందు ఈ కార్యక్రమం జరుపుకుంటున్నామని, ఈ గ్లోబల్ యాక్సెసి బిలిటీ అవేర్నెస్ డే అనేది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వెబ్, డిజిటల్ ఉత్పత్తులను ఎలా ఉపయోగిస్తారో, నిర్దిష్ట వైకల్యాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సాంకేతిక ఉత్పత్తులను రూపొందించడంలో వ్యక్తులకు సహాయ పడుతుందని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫారంను తెలుసు కోవడానికి ప్రతి ఒక్కరికీ అంటే దివ్యాంగులకు, వృద్ధులకు, సాధారణమైన వ్యక్తులకు ఒకే విధమైన సమానమైన అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ ఆర్‌టిసి బస్టాండ్ అంబేద్కర్ కూడలి, అనిబిసెంట్ కూడలి, ఎన్‌టిఆర్ సర్కిల్, శ్రీకృష్ణ దేవరాయల కూడళ్ళ మీదుగా నిర్వహించారు. ర్యాలీ లోటు టౌన్ పోలీసుస్టేషన్ రైటర్ రాంమూర్తి పాల్గొని వివిధ అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, యం.స్వీటీ, సోషల్ వర్కర్ గీత, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.


సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న బికెఎంయు నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బికెఎంయు ఆధ్వర్యంలో ఎంజి పురం గ్రామ సచివాలయం ఎదుట శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. బికెఎంయు రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు బేగం రాజశేఖర ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, సహాయ కార్యదర్శి కేశం ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పండుగోల మణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, కాలనీలు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఒకవేళ ఇచ్చినా గుట్టల్లోనూ, వాగుల్లోనూ, వంకల్లోనూ అరకొరగా ఇచ్చి చేతులు దులుపుతున్నారని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుంటే జూలై మొదటి వారంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గానుగపెంట ఆదినారాయణ, ఉపాధ్య క్షులు శాలంపాటి నరసింహులు, సహాయ కార్యదర్శి కోడూరు రవి, సుజాత, నరసమ్మ, గంగమ్మ, గౌసియా, లక్ష్మీనారాయణ, సుబ్బమ్మ, గౌరీ, లక్ష్మక్క పాల్గొన్నారు.

మసీదులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మదనపల్లె అర్బన్ : వక్ఫ్ బోర్డు కింద మసీదులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. పట్టణంలోని ముజీబ్ నగర్‌లోని మసీదును ఆయన శుక్రవారం సందర్శించారు. మసీదు కమిటీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు కమిటీలో ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో నూతన సభ్యులను నియమించు కోవాలన్నారు. ముఖ్యంగా మసీదు అభివృద్ధికి ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో పాటు అవసరమైతే వక్ఫ్‌బోర్డు ద్వారా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మస్తాన్, నౌషాద్, చాంద్ బాషా, జావీద్, రెడ్డి బాషా, ఫయాజ్, సికిందర్ బాషా, మౌలా పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా సాగుతున్న క్రికెట్ పోటీలు

నందలూరు : మండలంలోని అరవపల్లె లోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియం లీగ్ 7 లో భాగంగా నిర్వహిస్తున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాభిమానులను, స్థానిక ప్రజలను అలరించేలా ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిర్వహించిన మ్యాచ్ లో నాగిరెడ్డిపల్లె జట్టుపై నందలూరు జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నాని ఎంపికై షీల్డ్ అందుకున్నాడు. మధ్యాహ్నం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్ లో సింగిరెడ్డిపల్లి జట్టుపై సన్నీ లెవెల్స్ కడప జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో అత్యధిక స్కోర్ చేసి విజయంలో కీలక పాత్ర వహించిన భరత్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్ ను అందుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పెంచలయ్య, రాము, అరవింద్, శివ, రాజయ్య, శాంతారామ్, చందు, పిచ్ క్యూరేటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత

కొత్తకోట : పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ నరసింహ ప్రసాద్ వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని అన్ని వీధిలో నందు రాత్రి ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువ అన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా పట్టణంలో ప్రతి రోజు ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేయించడం జరుగుతోందన్నారు. ఈ బాధ్యతలను నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవికి అప్పగించడం జరిగిందన్నారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు యధావిధిగా జరుగుతున్నాయని అన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవన్నారు. నీటిని ఎక్కువరోజులు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ కార్యక్రమం స్థానిక సొసైటీ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమం టిడిపి యూనిట్ క్లస్టర్ ఇన్‌ఛార్జి డాక్టర్ అప్పినపల్లిభాస్కరాచారి పర్యవేక్షణలో కొనసాగింది. ఇంటింటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ చేసి హౌస్ మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా అవారు మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ ద్వారా స్థానిక ప్రజలు ఆయా డోర్ల నెంబర్ నందు నివసిస్తున్నారా లేదా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారా అనే అంశం నమోదు చేయబడుతుందని చెప్పారు. అదే కుటుంబంలో ఎవరైనా మరణించి ఉంటే వెరిఫికేషన్ ద్వారా విషయం తెలుసుకొని పార్టీ ఆఫీసుకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ పట్టణ అధ్యక్షులు నిసార్ అహ్మద్, బూత్ కన్వీనర్ బండి రామచంద్ర, స్థానిక టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


బృందావనాన్ని తనిఖీ చేస్తున్న డిఎల్‌పిఒ జయకుమారి

సంపద సృష్టించడమే బృందావనాల లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

చెత్తతో సంపదను సృష్టించడమే బృందావనం ప్రధాన లక్ష్యమని డిఎల్‌పిఒ కె.జయకుమారి తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి దగ్గర ఉన్న కలికిరి సచివాలయం-3 పరిధిలోని బృందావనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చెట్ల పెంపకం చేపట్టాలని, గోడలకు స్లోగన్లు రాయించాలని, త్వరితగతిన బృందావనానికి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. చెత్తను ఎరువుగా మర్చి సంపదను తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సచివా లయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బృందావనంలో చెట్లను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఇఒ ఉదయ్ కుమార్, ఇఒఆర్‌డి అబ్దుల్‌కలాం ఆజాద్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో కార్యాలయాన్ని ముట్టడిస్తున్న గ్రామస్తులు

ట్రాన్స్‌కో కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ట్రాన్స్‌కో కార్యాలయాన్ని శుక్రవారం బాలయ్యగారిపల్లి పంచాయతీ సమీపంలో ఉన్న దేవలంపేటలో ఉన్న ముస్లిములు ముట్టడించారు. తమ గ్రామానికి విద్యుత్‌లో వోల్టేజ్ తక్కువగా ఉండటం వల్ల ఇళ్లలో ఉన్న ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, బల్బులు, లోవోల్టేజ్ కారణంగా కాలిపోతున్నాయని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న లో వోల్టేజి ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను మార్చి విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించాలని కోరారు. స్పందించిన ఎఇ గ్రామస్తులతో మాట్లాడుతూ దేవళంపేటలో లోఒల్టేజి ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసు కుంటామని ఎఇ వరప్రసాద్ వివరించారు.

సకాలంలో విత్తన కాయలు అందించండి

లక్కిరెడ్డిపల్లి : ఖరీఫ్‌కు రైతు లకు సకాలంలో విత్తన కాయలు అందించాలని అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోనంపేట, బి.ఎర్రగుడి, దప్పే పల్లి, పర్వతరెడ్డిగారిపల్లి గ్రామా ల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌బికె లోని రికార్డులు విత్తన కాయల నాణ్యత పరిశీలించారు. విత్తన కాయలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులను ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో అందించాలన్నారు. ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సాగు సరిపడి విత్తనాలు అందించామని, ఆర్‌బికెలో పనిచేస్తున్న సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా రైతులకు సక్రమంగా అందించాలన్నారు. రైతులకు సకాలంలో విత్తన కాయలు అందించకుండా అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు ఎరువులు, విత్తన కాయలు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పా గంగిరెడ్డికి 'విద్యాశిరోమణి' అవార్డు

రాజంపేట : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమి తిరుపతి వారు 'విద్యా శిరోమణి' అవార్డుతో సత్క రించారు. శుక్రవారం తిరుపతిలోని హోటల్ బ్లిస్ నందు జరిగిన నీలం సంజీవరెడ్డి స్టేట్ అవార్డుల ప్రధా నోత్సవం కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించే లక్ష్యంగా 1998వ సంవత్సరంలో అన్న మాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్టును నెలకొల్పామని అన్నారు. రెండున్నర దశా బ్దాలుగా తెలుగు రాష్ట్రాలలో విద్యాసంస్థలను స్థాపించి విద్యార్థులకు నాణ్య మైన విద్యతోపాటు క్రమశిక్షణతో కూడుకున్న విద్యను అందిస్తున్నామని అన్నారు. విద్యారంగంలో చేసిన సేవలకుగాను విద్యా శిరోమణి అవార్డు నాకు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యా శిరోమణి అవార్డు రావడం పట్ల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, అనుబంధ కళాశాలల ప్రిన్సి పల్స్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణ, డాక్టర్ డి.స్వర్ణలత, డాక్టర్ డిజె.సమ తానాయుడు, డాక్టర్ బి.జయరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సంబేపల్లి మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో శుక్రవారం పిడుగు పడి పల్లెల గంగిరెడ్డి(55) అనే రైతుతో పాటు ఆవు మృతి చెందిన ఘటన చోటుచేసు కుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తన పొలం లో ఆవులు మేపుతుండగా కొద్దిసేపు ఉరుములు, మెరుపులతో గాలి, వర్షం రావడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకి వెళ్ళుతున్న సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య జీవనోపాధి కోసం కువైట్‌లో ఉండగా కొడుకు ఉన్నాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.


మృతి చెందిన రైతు, ఆవు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-మొలకలచెరువు

రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం ములకలచెరువు బస్టాండ్‌లో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని రాగిమానుపల్లికి చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ శుక్రవారం సొంత పనిమీద మొలకలచెరువుకు వచ్చాడు. బస్టాండ్ వద్ద నిలబడి ఉండగా బైకులో ఓ వృద్ధుడు వేగంగా వచ్చి విద్యార్థి విష్ణువర్ధన్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని పోలీసుల సహకారంతో చికిత్సల నిమిత్తం హుటాహుటిన 108లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు వైద్య చికిత్సలు అందించారు. ఆరోగ్యం మెరుగుపడటంతో కోలు కుంటున్నాడు. తనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి దారుణ హత్య

పీలేరు : స్థానిక పట్టణంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం సాయంత్రం పోలీస్ స్టేషనుకు కూత వేటు దూరంలోనే ఈ ఘటన జరగడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. స్థానిక బాలాజీ నగర్‌లో రసూల్ సాహెబ్ కుమారుడు మొహమ్మద్ అలీ (35) ఇంట్లో నిద్రిస్తుండగా బయటకు పిలిచిన గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్యచేశారు. మృతుడు మహుమ్మద్ అలీ పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఓ చికిన్ సెంటర్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలం చేరుకున్న పోలీసులు కేసునమోదుచేసి, హంతకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.